# తనికెళ్ళ భరణి పురస్కార స్వీకార పత్రం

'మో'

14.07.2011

మీ అందరి ముందు, ఇంత వందలాది మంది అందరిముందు మహామహులైన చలన చిత్ర కళాకారులందరిముందు వారి వందలాది కళాభిమానుల ముందు, సాహిత్య, సారస్వ వేత్తలముందు ప్రసిద్ధ, ప్రఖ్యాత, పరిణత కవులముందు, వారి వందలాది మంది అభిమాన యువకవులముందు నేను ఇలా చేతులుకట్టుకుని తలవంచుకొని బిడియపడుతూ సమర్థించుకోటానికి మాటలు రాక సంజాయిషీ చెప్పుకోటానికి అభిమానం అడ్డుపడుతూ- తెలిసి చేసిన నేరమేదో తెలీక, తెలియక చేసిన సాహసమేదోననే అనుమానస్పద స్థితిలో- నేనిలా ఈ సాయంకాలం నా సంధ్యాసమయంలో నాదే అయిన ఒకానొక సాంధ్యభాషలో ఏమి చెప్పాలో ఎలా చెప్పాలోననే అనవగాహన స్థితిలో పోనీ ఏదన్నా రాద్దామా- దాన్నే ఏదో ఒక అవస్థలో చదివేద్దామా అనే ఒకానొక సందిగ్ధ స్థితిలోంచి ఎక్కడ మొదలు పెట్టాలో ఏది ఆరంభానికి ప్రారంభమోనని నా సర్వదేహంతోనూ సందేహిస్తోంటే- చిన్నప్పుడెప్పుడో చదివిన 'ఆలిస్ ఇన్ వండర్‌లాండ్'లోంచి ఓ స్వరం విన్పించింది. "Begin at the beginning….and go on till you come to end; then stop'' అని. సరే. ముందుగా నన్ను నేను నా కవితా రుషి టి.ఎస్. ఎలియట్ మాటల్లోనే వర్ణించుకుంటాను- అంటున్నాడు ఆల్ఫ్రెడ్.జె.ప్రూఫ్రాక్ నాలానే

I grow old …. I grow old…

I shall wear the bottoms of my trousers rolled

నిజమే కదూ! మీలానే ప్రూఫ్రాక్‌ని చూస్తోన్న వాళ్లు కూడా అనుకొంటున్నారట స్వగతాలుగా!

(How his hair is going thin!

……

But how his arms and legs are thin!)

ప్రూఫ్రాక్ ఏమన్నాడో చెప్పనా? "I have measured out my life with coffee spoons" నా భయమేమిటో చెప్పనా, ప్రూఫ్రాక్‌లానే?

I have seen my head (grown slightly bald)
Brought in upon a platter
I am no prophet- and here's no matter!

అవునూ వీడేవిటి వాడి తెలుగు కవిత్వాన్ని గురించి చెప్తాడనుకుంటే ఆంగ్లంలో గొణుక్కుంటున్నాడనుకుంటున్నారు కదూ!

అవును. నేను రాసే తెలుగు అందరూ రాసే తెలుగులాంటిది కాదు. అది కవిత్వమైనా వచనమైనా. నాకసలు ఈ రెండు భాషల్లో ఏదీ పూర్తిగా రాదు. భావానికి శబ్దాన్ని అల్లుతాను ఊరికినే. కవిత్వ భాష నాకొక మాయ లాంతరులాంటిది. ఆ మాయ లాంతరు తన వెల్తురు నరాల్ని తెరమీద అల్లుతుంది. ఈ మాట నాదికాదు నిజానికి. ఎక్కడ్నుంచి కొట్టేసానో చెప్పుకోండి!

(ఇక్కడ ప్రొఫెసర్స్ ఆఫ్ ఇంగ్లీష్ ఎవరైనా ఉన్నారా?) సాధారణ కవులు మహాకవుల్ని అనుకరిస్తారు. అసాధారణ కవులు మహాకవుల్నించి తస్కరిస్తారు. నేను సాధారణ కవినీ కాను, మహాకవినీ కాను, అసాధారణ కవిని. కవిత్వపు మాయలాంతరనేది ఒక్క వెల్తుర్నే కాదు ప్రసరించేది. నీడల్ని కూడ. ఛాయల్ని కూడ. జాడల్ని కూడ. అందుకే అన్నాడు మహాకవి ఎలియట్ -

Between the idea
And reality
Between the motion
And act
Falls the shadow

ఈ వెల్తురు యొక్క ఛాయనే నేను చిత్రించాను నా ప్రథమ కృతి 'చితి-చింత'లో. దానిలోని నీడలేమిటో నీడల గొడవేమిటో గొడవ గొడవ గొడవగా ఉందని చాలామంది గోలుగోలుగా గగ్గోలు పెట్టారు. సరే! తెలుగు కవిత్వాభిమానులారా మీ పనిలా ఉందాని మరో కవితా గ్రంథం 'రహస్తంత్రి' వెలువరించాను.

"అట్లా అని పెద్ద బాధా ఉండదు" అని 'చితి-చింత' (1969)లో ఆరంభించినవాడినల్లా 'రహస్తంత్రి' (1991)లో ఒక కవిత 'ఎక్స్‌ప్రెషనిజమ్' అనే దానికి 23 పాదసూచికలిచ్చాను. దీంతో

పాఠకులు మరీ అయోమయంలోకి మునిగిపోయి ఇక వీడితో లాభం లేదని నన్ను పూర్తిగా ఒదిలేసారు.

అయినా నేనొదుల్తానా నా ప్రియ పాఠకుల్ని?

ఈ సారి కాగితం మీద రాయకుండా కవితల్ని అన్నిటినీ టేప్ రికార్డర్‌కి వినిపించి 'పునరపి' (1993) ప్రచురించాను. ఇది వచన కవిత్వమూ కాదు శుద్ధ వచనమూ కాదు. కాని ఒక కొత్త వాచ్య కవితను, శబ్దాశ్రయ కవిత్వాన్ని సాధించాననుకొంటాను.

అంతకు కొంచెం ముందే 1990లో 'బతికిన క్షణాలు' అన్నిటినీ ఒకే ప్రవాహంలో రెండు రాత్రులలో రాసేసాను. మిగిలిన క్షణాలకోసం చాలా ఆసక్తిగా ఎదురుచూసారు పాఠకులు. పూర్తిగా అన్నీ విప్పిచెప్పే అమాయకత్వం నాకెపుడూ లేదు. అసలు భావాన్ని ఏ భాషలోనైనా పూర్తిగా విప్పి చెప్పగలమా అనే Ontological అనుమానం నాకెపుడూ ఉంది, ఇపుడూ ఉంది. 'సాంధ్య భాష' 1999లో ప్రచురించినపుడు అసలు 'సాంధ్యభాష' అంటే అర్థమేమిటో (ఈ పదానికే అర్థమేమిటో) కాస్త అర్థమయ్యేట్లు రాస్తే ఓ పార్కర్ పెన్ బహుమతిగా ఇస్తానని పత్రికా ప్రకటన చేశాడో విమర్శక మిత్రుడు! పైగా అతడొక తెలుగు పండితుడు.

వినండి మరోసారి నా మహాకవి మాటలు!

Between the conception<br>
And creation<br>
Between the emotion<br>
And the response<br>
Falls the Shadow

నా కవిత్వమంతటా ఆ వెలుగునీడల సయ్యాటలో భావ ధారణకీ భాషాసృష్టికీ మధ్యలో భావావేశానికీ ప్రతిస్పందనకీ మధ్యలో ఒకానొక ప్రకాశవంతమైన ఛాయపడుతూనే ఉంటుంది. అక్కడితో ఆగితే బావుండును. మళ్లీ ఈ 'నిషాదం'తో ఓ పదేళ్ళ తర్వాత మీ ముందుకొచ్చాను. ఈ సారి ప్రతిస్పందన కొంత సానుకూలంగానే ఉన్నట్లనిపిస్తోంది. అంచేతే ఈ పురస్కారం దక్కింది. అదీ ఒకానొక గొప్ప భావుకుడు, కళాకారుడు, నటుడు, నాటక రచయిత, ప్రయోక్త,

దర్శకుడు, చిత్రనిర్మాత, గాయకుడు, భక్తి తత్పరుడు అన్నింటికీ మించి చాలచాల మంచి మనసున్న మంచి మనిషి, తన ఆనందాన్ని అందరికీ ఆహ్లాదంగా పంచిపెట్టే మనీషి, ఆషామాషీగానే కన్పించే మంచి రుషి భరణి, వెండితెరమీద ఆంధ్ర దేశంలో ఊరూరా కన్పించే నక్షత్రం తనికెళ్ళ భరణి నించి రావటం మీకే కాక నాకూ ఆశ్చర్యాన్ని కలిగించింది. చూడండి గమ్మత్తు! విషాదం నిండిన 'నిషాదం'కు పురస్కారం రావటం.

అదట్లా ఉంచి కొంచెం సీరియస్ విషయాల్లోకి వెళ్దామా మళ్లీ?

నా కవిత్వ శైలి రసవాద శైలి Hermitic

వ్యక్తీకరణ వినిర్మాణ విధానం Deconstructionistic

నా భావావేశం అన్వేషణాత్మకం Search warrant

నా అంతరంగం అస్తిత్వవాదాత్మకం Existential

నా నిర్వచనం కవిత్వం భాష యొక్క భాష Metalinguistic

నా వాక్య నిర్మాణం ఉక్కిరి బిక్కిరి శ్వాస......

...............Syntactical breathlessness

నా కవితా వస్తువు ఏక ఘాతరేఖ కాదు Not linear

కాదు, కాదు, నేతి, నేతి సరే ...మరేదంటే

నా పదబంధాలలో పదాల స్థానాభాసం(Displacement) ఉంటుంది. దీనివల్ల ఎదురుచూడని (Unexepected) అలవాటుకాని (Nondescript) పదాల చేరిక (Collocation) ల వల్ల ఆశ్చర్యం కలుగుతుంది గాని ఒకానొక చేతనాచేతన (Subconscious) స్ఫురిస్తుంది కాని పూర్తిభావ వినిమయం (Communication) జరగదు.

ఒకరకంగా చెప్పాలంటే 'ఎవియో అర్థమ్ముకాని రక్తి స్ఫురించున'వే గాని 'భావగీతమ్ములు' మాత్రం కాదు. కవిత్వంలో నా వాస్తవికతకు మూలం అసంభవాత్మక (Absurdity) సత్యం. నా వాచకం (Text) లో అనేక వాచకాలు(Subtext) ఉండటం, అనున్యూత కలయిక (Montage) అనే శిల్పం ఉండటం, కథాంశాలు అవాస్తవిక గాథలు (Fabulae) ఆధునిక వాస్తవ వాదానికి జోడింపబడటం వల్ల -నా కవిత్వంలో సంక్లిష్టత ఉంటుంది. అస్పష్టత వేరు, సంక్లిష్టత వేరు. రష్యన్ చలన చిత్ర దర్శకుడు సెర్జీ ఐజన్స్టిన్ అన్నమాటలు ఈ సందర్భంలో గుర్తుంచుకోవాలి.

“Any two pieces of film of any kind, placed together inevitably combine into a new concept, a new quality arising out of the juxtaposition”

ఈ గత నలభై సంవత్సరాల నుండి విమర్శకులు నా కవిత్వంలో ఉన్న నలభై దుర్లక్షణాల గురించి చాలా వ్యాసాల్లో, ప్రసంగాలలో ప్రస్తావించారు. కాలక్రమంలో వాటన్నిటికీ కాకపోయినా కొన్నిటికయినా వారు సర్దుబాటు చేసుకొన్నట్లనిపిస్తుంది.

కవిత్వంలో మంచి లక్షణాలేమిటో నా వ్యాససంకలనాలు ‘కరచాలనం’, ‘నీడలు-జాడలు’ ‘వెన్నెల నీడలు’ గ్రంథాలలో విప్పి చెప్పటానికి కొంత ప్రయత్నించాను.

నా కవిత్వంలో ఋషులెవరో చెప్పేస్తానివ్వాళ. జాన్ డన్, విలియం బ్లేక్, తామస్ హార్డీ, వాల్టర్ డిలమార్, హాప్కిన్స్, మలార్మే, బాదెలేర్, ఎలియట్‌లు. 1990స్ క్షీణ దశాబ్ది కవులు ఎర్నెస్ట్ డౌసన్, స్విన్ బర్న్‌లు కూడా నా గురువులే.

“మానవుడు చేసే ఒకే ఒక అకర్మక క్రియ కవిత్వం” అన్నాడు రాబర్ట్ లోవెల్.

పదాల సమాహారంలో అర్థాన్ని కాక ధ్వని (Suggestion)ని వినగలగాలి.

త్యాగానికీ సత్యానికీ, ప్రేమకీ సౌందర్యానికీ, సహాయానికీ సానుభూతికీ సాంఘిక చైతన్య స్ఫూర్తికీ నానాటికీ దూరం అవుతున్న సమకాలికతను రక్షించేదీ దగ్గర చేసేదీ కవిత్వం ఒక్కటే నేటికీ ఏనాటికి. అలాంటి అనుకోని ఆవిష్కరణను సాధించే శక్తి (Serendipity) ఒక్క కవిత్వానికే ఉంది.

నిన్న రాత్రి ముంబైలో కొద్దిమంది మనుషులు వందలాది మంది మనుషుల్ని చంపడంలోని అమానుషత్వాన్ని ప్రశ్నించేది నిజమైన కవిత్వం.

కళల వల్ల, కవిత్వం వల్ల మనం సాధించేదేమిటి? ఏమిటీ అంటే సృజన. సృజన వల్లనే అశాశ్వతాన్నించి తప్పించుకోగలం.

సృష్టి శాశ్వతం. ఈ అనంత విశ్వం శాశ్వతం. మేరు పర్వతాలు, మహా సాగరాలు శాశ్వతం. రోజా సాయంత్రానికి

రాలిపడిపోయే పూలూ శాశ్వతమే. ఒక్క మానవుడు మాత్రం అశాశ్వతం.
మానవత్వమొక్కటే శాశ్వతం.
కళాత్మక సృజన ఒక్కటే మానవత్వాన్ని శాశ్వతం చేస్తుంది.
"Every one can achieve immortality to a smaller or greater degree of shorter or longer duration" అని మిలాన్ కుందేరా అభయహస్తం ఇస్తున్నాడు.

కళాకారులంతా అమరులే. కానీ కొందరు కళాకారులు కొద్దికాలంపాటు అమరులైతే, మహా కళావేత్తలు కొంచెం కొంచెం ఇంకొంచెం ఎక్కువ కాలం అమరులవుతారన్నమాట. ప్లేటో, సోక్రటీస్, దాంతే, వర్జిల్, సోఫొక్లిస్, షేక్స్పియర్, టాల్‌స్టాయ్, దోస్తావ్ స్కీ, గెతే, మిల్టన్‌లు మన మన మానవ మేధకు అల్జీమర్స్ రానంతకాలం కొద్ది కాలమో, దీర్ఘకాలమో అమరులవుతారన్నమాట. మహా ప్రళయం వచ్చే వరకూ హిమవన్నగాలూ, హిందూ మహాసముద్రాలూ శాశ్వతం. చిత్రకళ, సంగీతం, శిల్పం, నాట్యం, భవన నిర్మాణం, సాగరాలపై సేతువులు, సముద్రంలో సొరంగ రైలు మార్గాలు, రోదసీలో సర్కస్ గిరికీలు, జంత్రం, యంత్రం, గాత్రం హ్యూమన్ స్పిరిట్ ఉన్నంత వరకూ శాశ్వతాలు. మన శ్రీశ్రీ, మన కృష్ణశాస్త్రి మనకు మరపురానంత వరకూ శాశ్వతులు. కనుక కవిత్వమంటే అభిజ్ఞానం అన్నమాట.!

నా సాహిత్య ప్రస్థానంలో నన్ను నిరంతరం ప్రోత్సహిస్తూ వచ్చిన 'చేరా'గారికి సోదర కవులు చినవీరభద్రుడు, సీతారాం, త్రిపురలకూ, రెండుసార్లు పురస్కారాలందించిన తెలుగు విశ్వవిద్యాలయానికీ, 1970లోనే నను గుర్తించిన ఫ్రీ వెర్స్ ఫ్రంట్‌కూ, వెన్నుతట్టిన యగళ్ళ ఫౌండేషన్‌కూ అభివాదాలు తెల్పుకుంటున్నాను. ఈనాటి Birth day boy భరణికి Many happy returns.

❖ ❖ ❖